క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : మహిళలు పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని రెడ్డి మహిళా పరపతి సంఘం భవన నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే చైతన్యవంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు'



వర్ధన్నపేట : మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న సుందరీమణులకు ఎస్సీ, ఎస్టీ మహిళల చేత కాళ్లు కడిగించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరు సరికాదని బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల్లో పాల్గొని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన వారి కోసం చిరువ్యాపారులను తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తోందని ఆరోపించారు. దళిత, గిరిజన మహిళలను అవమానించారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు కొండేటి అనిత, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, నాయకులు భూక్యా తేజా నాయక్, గిరిప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబండి స్వాధీనం

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్‌లో అటవీ శాఖ అధికారులు అనుమతి లేకుండా పోడు భూముల్లో బోర్లు వేస్తున్న బోరుబండిని గురువారం స్వాధీనం చేసుకున్నారు. బోరుబండిని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ వజాహత్ మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పోడు భూముల్లో బోర్లు వేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. చిలుకమ్మనగర్ శివారు పోడు భూముల్లో కొద్ది రోజులుగా ఇష్టారీతిన బోర్లు వేస్తున్నారని చెప్పారు.

విజేతలకు బహుమతులు



గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలీలో రైజింగ్ యూత్ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించిన క్రమంలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు నిర్వాహకులు గురువరం బహుమతులు అందజేశారు. క్యాంపులో ఇంటర్‌లోపు చదువుతున్న విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, క్రికెట్‌లో శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో స్కూల్ కాలనీ టీంపై బస్టాండ్ టీమ్ విజయం సాధించింది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాగిత భిక్షపతి, యూత్ ప్రతినిధులు రాజబోయిన భిక్షపతి, కృష్ణమోహన్, నాగరాజు, కట్టమల్లు, మహేందర్, దిలీప్, నాగేంద్ర, ప్రభాకర్, సాయి శ్రీను, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని జేతురాంతండాకు చెందిన నేతావత్ తారాచంద్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. అనంతరం కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గ్రామానికి చెందిన గుగులోతు రూప్లానాయక్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చులు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు లేతాకుల రంగారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, దేదావత్ వెంకన్న, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండలో..

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన సోషల్ మీడియా మండల కన్వీనర్ కట్ట శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పీసీసీ సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడప మహేశ్ గురువారం పరామర్శించారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సారం ప్రభాకర్, సారం అభిలాశ్, పులిచేరి రాధాకృష్ణ, కోగిల సుధాకర్, అత్తి రేవతికుమార్, లచ్చునాయక్, నరుకుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్లు నిరుపయోగం

● ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యం

నెక్కొండ : అసలే వేసవి కాలం. ఎండ తీవ్రత. మూగజీవాల దాహార్తిని తీర్చేలా గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పలు గ్రామాల శివార్లలో పశువులకు, పక్షుల, ఇతర జీవాలకు నీటి వసతి కల్పించేందుకు నిర్మించిన నీటి తొట్లు పలు చోట్ల కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నీటి కోసం జీవాలు అల్లాడుతున్నాయి. వేసవి కాలంలో పశువులతోపాటు పక్షుల, వన్యప్రాణుల దాహార్తిని గత ప్రభుత్వం మండల కేంద్రంలోని వార సంత ప్రదేశంలో, ఇతర 10 చోట్ల పశువుల కోసం ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన నిధులతో నీటి తొట్ల నిర్మాణం చేపట్టింది. నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు కేటాయించింది. కాగా కొన్నేళపాటు నిర్వహణ బాగానే ఉన్నా సుమారు 2, 3 ఏళ్లుగా వేసవి కాలంలో నీటితొట్లలో నీళ్లు పెడుతున్న దాఖలాల్లేవు. ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచి ఎండల తీవ్రత పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండల కేంద్రంలో వార సంతకు వచ్చే పశువులతోపాటు గ్రామాల శివార్లలో నిర్మించిన తొట్లలో నీరు లేక పక్షులు, వన్యప్రాణులు ఇబ్బంది పడుతున్నాయి. పల్లెల్లో భూగర్భజలాలు అడుగంటి పోయి మూగ జీవాలకు, పక్షులకు, వణ్యప్రాణులకు తాగడానికి నీరు దొరకని దుస్థితి నెలకొంది.



నెక్కొండ సంతలో నిరుపయోగంగా ఉన్న తొట్టి



బంజరుపల్లి పశువుల నీటితొట్టి

ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యం..!

మండలంలో మూగజీవాల దాహం తీర్చేలా నిర్మించిన నీటితొట్ల నిర్వహణలో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాడి రైతులు వారు సాకుతున్న పశువులకు నీటి సదుపాయం కల్పించుకుంటున్నా కోతులు, ఇతర జంవులు, పక్షులు నీటి కోసం అల్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఎండల తీవ్రతతో రెండు నెలలుగా పశువులు, పక్షులు ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. పంచాయతీ సిబ్బంది నీటితొట్లలో నీళ్లు పెట్టడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం పర్యవేక్షించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం



మండలంలోని పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లలో నీళ్లు లేని విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలి. పంచాయతీ వర్కర్లు నీళ్లు పెట్టేలా కృషి చేస్తా. నీటితొట్లను వినియోగంలోకి తీసుకొస్తాం.

– జాకబ్, ఏపీఓ

కొయ్యకాళ్లకు నిప్పు.. పొలాల్లో మంటలు

● ఎస్సై చొరవతో అదుపులోకి..

నల్లబెల్లి : వరి పంటలకు సంబంధించిన కొయ్యకాళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పొలాల్లో మంటలు చెలరేగాయి. ఎస్సై గోవర్ధన్ చొరవ తీసుకుని అదుపులోకి తీసుకొచ్చారు. వివరాలిలా.. మండలంలోని నల్లబెల్లి శివారులోని పొలాల్లోని కొయ్యకాళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో ఎస్సారెస్పీ కాల్వ నుంచి ముచ్చింపుల వెంకటపాలెం చెరువు వరకు మంటలు వ్యాపించాయి. దీంతో సమాచారం అందుకున్న ఎస్సై గోవర్ధన్ పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని సమీప పొలాల్లో రైతులు నిల్వ చేసిన ధాన్యం రాసులకు మంటలు వ్యాపించకుండా స్థానిక రైతుల సహకారంతో సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎస్సై, పోలీసుల చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.



మంటలను అదుపు చేస్తున్న ఎస్సై, సిబ్బంది

హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం

సంగెం : మండలంలోని కుంటపల్లిలో హనుమాన్ జయంత్యుత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మాలధారులు ఏకనామస్మరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు జగన్నాథచారి, సూరయ్య, కోటేశ్వర్ మాట్లాడారు. నేడు శోభాయాత్ర, 17న మౌనవ్రతం, 18న పాదయాత్ర, ఇరుముడి హోమం, 21న ఇరుముడి, 22న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వాములు రమేశ్, సారయ్య, రాజేందర్, శివకుమార్, రాజు, నాగరాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఏకనామస్మరణ చేస్తున్న మాలధారులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు మల్లేశం, యువరాజు, తదితరులు

● కార్మిక సంఘాల నేతలు మల్లేశం, యువరాజు

నర్సంపేట : ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ కూడలి నుంచి జయలక్ష్మి సెంటర్ వరకు గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాగర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుంపెల్లి మునీశ్వర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడారు. కార్మిక చట్టాల అమలు, కార్మికులకు గుదిబండగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయడంతోపాటు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా కార్మిక చట్టాలన్నిటినీ కలిపి 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులు దోచుకునేలా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడం సరికాదన్నారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మినారాయణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్, పట్టణ కార్యదర్శి రాజు, బీఆర్‌టీయూ నాయకులు రవి, వేణుచంద్, ప్రసాద్, రాజు, అనిల్, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు అశోక్, రవి, పైడి, ఆనంద్, ఐఎఫ్‌టీయూ నాయకులు కుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కు దీటుగా బడిబాట

హెచ్‌ఎం చొరవతో స్వచ్ఛందంగా నిర్వహణ

● గ్రామాల్లో ఇంటింటికీ ఉపాధ్యాయులు



నందిగామలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నల్లబెల్లి : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుల బడిబాట సాగుతోంది. ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ చొరవతో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ హైస్కూల్‌లో లభిస్తున్న సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. నందిగామ హైస్కూల్ ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట నిర్వహిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు.

నందిగామలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యలో 94. హెచ్‌ఎం అనురాధ, 11 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు మొదలైన నేపథ్యంలో హెచ్‌ఎం అనురాధ ఉపాధ్యాయులతో సమావేశమై ముందస్తు బడిబాట నిర్వహించాలన్న విషయమై చర్చించారు. ఉపాధ్యాయులు సుముఖత వ్యక్తం చేయడంతో ఈనెల 1వ తేదీ నుంచి స్కూల్ పరిధిలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ స్కూల్‌లో అనేక ఏఐ వంటి కేతిక సదుపాయాలతోపాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పుస్తకాలు, క్రీడలు, తదితరాలను వివరిస్తున్నారు.

అర్హులైన ఉపాధ్యాయులు, అనేక వసతులు

ప్రభుత్వ స్కూళ్లలోనే అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని, ప్రభుత్వం ఏఐ లాంటి సాంకేతిక సదుపాయాలతోపాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు వంటి వసతులు కల్పిస్తోందన్న విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో డిగ్రీ, పీజీ చేసిన ఉపాధ్యాయులు సైతం బోధిస్తుండగా ప్రభుత్వ హైస్కూల్‌లో బీఈడీ, ఇతర ఉన్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారన్న విషయమై అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే పేద విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్నారు. పదో తరగతిలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలను, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

ఉత్తమ ఫలితాలు..

గత విద్యా సంవత్సరం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఉతీర్ణత సాధించగా పేద కుటుంబానికి చెందిన సీహెచ్.సూర్యతేజ 527 మార్కులు సాధించిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నారు. గుణాత్మకమైన విద్య అందిస్తామని, జవాబుదారీగా వ్యవహరిస్తామని భరోసా కల్పిస్తున్నారు.

సత్ఫలితాలు



ముందస్తు బడిబాటతో సత్ఫలితాలొస్తున్నాయి. ఇప్పటివరకు 9 మంది విద్యార్థులు కొత్తగా పాఠశాలలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితంగా తల్లిదండ్రుల్లో చైతన్యం పెరుగుతోంది. పదో తరగతి విద్యార్థులు సాధించిన మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.అనురాధ, హెచ్‌ఎం

గిట్టుబాటు కూలిపై అవగాహన కలిగి ఉండాలి

● ఏపీఓ శారద

దామెర : ఉపాధిహామీ కూలీలు గిట్టుబాటు కూలిరేట్లపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని పులుకుర్తి రంగనాయకమ్మ చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 120 మంది కూలీలు హాజరుకావడంపై మేట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి కూలీ కొలత ప్రకారం రోజుకు రూ.307 పొందె విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని కూలీలకు సూచించారు. ఆమె వెంట ఈసీ రాజేశ్, సీనియర్ మేట్ లత, కారోబార్ ఆనందం, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



పులుకుర్తిలో అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శారద

జీపీ కార్మికుల సమ్మె నోటీస్ అందజేత

ఐనవోలు : సీఐటీయూ గ్రామపంచాయతీ కార్మికులు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందించారు. మండల కేంద్రలోని అంగడి సెంటర్‌లో సీఐటీయూ జీపీ కార్మికులు మండలస్థాయి సమావేశం గురువారం జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుని అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నోటీస్ అందజేసినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మెలో ప్రతీ జీపీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఈ సందర్భంగా జీపీ కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, బొట్ల సారంగపాణి, మండల అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి సురేందర్, కుమారస్వామి, శ్రీనివాస్, ఏసెబు, మల్లేష్, చంద్రయ్య, మల్లేష్, పూల, భాగ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

రెడ్‌క్రాస్ వైద్య సేవలు వినియోగించుకోవాలి

● డాక్టర్లు కిషన్‌రావు, తయార్ మసూద్

దామెర : రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని ఆ సంస్థ డాక్టర్లు కిషన్‌రావు, మొహమ్మద్ తయార్ మసూద్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల రూరల్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా పరీక్షలు చేసుకుని వైద్యుల సలహాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, గంగాధర్, జగదీశ్వర్, శ్రీకాంత్, నర్సింహాచారి, పోశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ల్యాదెళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నివాళి

వర్ధన్నపేట : మండలంలోని దివిటిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కూనూరు రాజు (40) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని కుమారస్వామి పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బుంగ ప్రవీణ్ లత, సిలువేరు కుమారస్వామి, కందిక సారయ్య, పిట్టల రాజు, కూనూరు జగన్, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన చెలుమల మంగమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి గురువారం 50 కేజీల బియ్యంతోపాటు ఆయిల్ క్యాన్, ఇతర సరుకులు అందజేశారు. తొలుత మంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు రాము, తేరాల యాకయ్య, కేతం ఎల్లయ్య, దురిశెట్టి మధూకర్, కుమారస్వామి, కోతుల మల్లయ్య, కొమురయ్య, కన్నెబోయిన కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రేకుల ఇల్లు దగ్ధం

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలోని సరిత–సాంబయ్య దంపతులకు చెందిన రేకుల ఇల్లు గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దంపతులు కూలీ పనులకు వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో ఇంటల్లో ఉన్న బట్టలు, బియ్యం, సామగ్రి కాలిపోయాయి. స్థానికులు మంటలను ఆర్పివేసినా బాధిత కుటుంబం భారీగా నష్టపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని గూడూరు మండలంలోని భూపతిపేటకు చెందిన జక్కుల రవి (36) మండల కేంద్రానికి వచ్చి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఖానాపురం శివారులో బైక్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

నర్సంపేట రూరల్ : వివాహిత అదృశ్యమైన ఘటన నర్సంపేట మండలంలోని ఆకులతండాలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. తండాకు చెందిన ధరావత్ రజిత గురువారం ఉదయం 11 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో రజిత భర్త సుక్రు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లాగౌడ్ జీవితం యువతకు ఆదర్శం



సంగెం : మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రవి



గీసుకొండ : నివాళులర్పిస్తున్న నాయకులు

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

సంగెం : ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు నారగోని ఎల్లాగౌడ్ జీవితం యువతకు ఆదర్శమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేటలో గురువారం ఎల్లాగౌడ్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి అతిథిగా హాజరై ఎల్లాగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎల్లాగౌడ్ పోరాటాలు నిర్మించారని గుర్తు చేశారు. మరణానంతరం అవయవ దానం చేశారని తెలిపారు. ఎల్లాగౌడ్ స్ఫూర్తితో సమస్యలపై ప్రజలు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, డివిజన్ కార్యదర్శి మంద రవి, మండల కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు వెంకన్న, రాంచందర్, సోమిడి రవి, గూడ సురేశ్, మల్లారెడ్డి, పెండ్యాల లలిత, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్యపల్లిలో...

గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లిలో కమ్యూనిస్టు నాయకుడు ఆకుల జనార్దన్ 17వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ నివాళులర్పించి మాట్లాడారు. జనార్దన్ పేదలకు అండగా పోరాడారని గుర్తు చేశారు. జనార్దన్ జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూసం రమేశ్, నాయకులు ఆకుల రుద్రప్రసాద్, స్రవంతి, వెంకటేశ్వర్లు, మంజుల, రవీందర్, మమత, రాజు, పరిమళ, రాము, శివ పాల్గొన్నారు.

రైతు దంపతులను అదుపులోకి తీసుకుని వదిలేసిన పోలీసులు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన రైతు గరుగు మల్లేషంను పోలీసులు సతీసమేతంగా అదుపులోకి తీసుకుని తదనంతరం వదిలేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం.. పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్ సమీపంలో మల్లేషంకు చెందిన వ్యవసాయ భూమిలో రోడ్డు వేసేందుకు కొంత మేరకు రోడ్డు తవ్వడంతో రోడ్డు వేసే వారితో మల్లేషం వాదనకు దిగాడు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మల్లేశం దంపతులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి తదనంతరం వదిలేశారు. కాగా ఘటనా స్థలికి పోలీసులతోపాటు రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేసిన క్రమంలో పట్టా భూమిగా తేలడంతో మల్లేషం దంపతులను వదిలిపెట్టినట్లు తెలిసింది.

చిందు యక్షగానానికి ప్రజాదరణ

రాయపర్తి : చిందు యక్షగానానికి ప్రజాదరణ వెల్లువెత్తుతోంది. మండలంలోని సన్నూరులో నాలుగు రోజులుగా చిందు యక్షగానం నిర్వహిస్తుండగా ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకుని తిలకిస్తున్నారు. సమాజంలో చిందు యక్షగానం అంతరించిపోతున్న ప్రస్తుత తరుణంలో కళాకారులు గ్రామంలో కార్యక్రమం నిర్వహించడంతో గ్రామస్తులు ఆదరిస్తున్నారు. గ్రామంలో నాలుగు రోజులుగా సత్యహరిశ్చంద్ర, శ్రీరాముడి లీలలు, తదితర కథలను వేస్తుండగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చిందు యక్షగానాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు